## క్లుప్తంగా

### హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**నాగలాపురం:** మండలంలోని రాజులకండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని సీడీపీఓ శోభారాణి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 21–35 ఏళ్ల వయస్సు ఉండి, పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులని పేర్కొన్నారు. వచ్చే జనవరి 6వ తేదీ లోపు పిచ్చాటూరు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

### మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూధి తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

### ఉద్యోగోన్నతులు కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

**శ్రీకాళహస్తి:** వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధంగా ఉన్న తిరుపతి జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం నాయకులు సోమవారం శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తి రెవెన్యూ పరిధిలో పలు మండల రెవెన్యూ కార్యాలాయల్లో అటెండర్, రికార్డు అసిస్టెంట్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని ఏళ్ల తరబడి వీఆర్‌ఏలే చేస్తున్నారన్నారు. వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించాలన్నారు. స్పందించిన ఆర్డీఓ న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెనగడం గురవయ్య, వీఆర్‌ఏలు అంకయ్య, బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### శ్మశానానికి స్థలం చూపండి



అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్ బాబు

**శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట):** దశాబ్దాలుగా తమ గ్రామానికి శ్మశానం లేదని, స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ సదస్సులో జీ పాళెం గ్రామస్తులు రెవెన్యూ అధికారులను కోరారు. రేణిగుంట మండలం జీ పాళెం సచివాలయంలో సోమవారం తహసీల్దార్ సురేష్ బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం ఏడు సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. జీపాళెంలో శ్మశానం లేక ఇబ్బందులు పడుతున్నామని, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. సదస్సులో శ్రీనివాసులు, శివారెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

### పంట నమోదు చేసుకోవాలి



ముస్లింపాళెం వద్ద పంట నమోదు చేస్తున్న ఏఓ గౌరి

**వరదయ్యపాళెం:** మండలంలోని రైతులందరూ విధిగా రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా పంట నమోదు చేసుకోవాలని ఏఓ గౌరి సూచించారు. సోమవారం మండలంలోని ముస్లింపాళెం, సీఎల్ఎన్‌పల్లెలో పర్యటించి పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రైతులకు అందాల్సిన పథకాలు, రాయితీ, పీఎం కిసాన్ అందాలంటే పంట సాగు చేసిన ప్రతి రైతూ పంట నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతూ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని, అందుకు గడువు ఈ నెల 31వ తేదీ తుది గడువు అని, ఆ లోపు పంట సాగు చేసిన రైతులందరూ బ్యాంకుల్లో గానీ, పోస్టాఫీస్‌లో గానీ ప్రీమియం నగదు చెల్లించాలన్నారు.

### నో 'పార్కింగ్'



నోపార్కింగ్ బోర్డు పక్కనే ఆపిన వాహనాలు

**శ్రీకాళహస్తి:** ముక్కంటి ఆలయం నుంచి జల వినాయకుని గుడి నాలుగో గేటు వరకు వాహనాలు రద్దీగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంతమంతా నోపార్కింగ్ బోర్డు ఏర్పాటు చేశారు. అయినా వాహన యజమానులు తమకేమీ పట్టనట్లు నో పార్కింగ్ బోర్డు పక్కనే ఆపుతున్నారు. పార్కింగ్ రుసుం వసులు చేసే ఆలయ సిబ్బంది ఏమీ ఎరగనట్లు పార్కింగ్ రుసుం మాత్రం వసూలు చేసుకుని, ఎక్కడైనా పెట్టుకోండని వదిలేస్తున్నారు. శని, ఆది, సోమవారాల్లో రద్దీ సమయాల్లో ఇలా పార్కింగ్ చేయడంతో చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. ఆలయాధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలు ఆపకుండా కేటాయించిన ప్రాంతాల్లో వాహనాలు నిలిపే చర్యలు తీసుకోవాల్సి ఉందని భక్తులు కోరుతున్నారు.

# అదోమహారాజ్యం

కుట్టినా 'మేల్కోరు'





కళ్యాణమండపం వీధిలో నిల్వ ఉన్న మురుగు నీరు

వర్షాలు కురిశాయి.. దోమలు వృద్ధి చెందాయి.. జనంపై దండెత్తుతున్నాయి.. వ్యాధులు ప్రబలుతున్నాయి.. పలువురు మంచం పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.. అయినా మశక నివారణ చర్యలు శూన్యంగా కనిపిస్తున్నాయి. వీటి నివారణకు గతంలో మంజూరు చేసిన ఫాగింగ్ యంత్రాలు అటకెక్కాయి. నిధులొచ్చినా అధికారులు, కూటమి పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలొస్తున్నాయి. అయినా మేల్కోని పరిస్థితులు రాజ్యమేలుతున్నాయి. ఏమిటో ఇ'దోమా'య అని జనం అంటున్నారు.

- దండెత్తుతున్న దోమలు
- అటకెక్కిన ఫాగింగ్ మిషన్లు
- నివారణ చర్యలు శూన్యం
- పట్టించుకోని అధికారులు



**సత్యవేడు:** నియోజకవర్గ పరిధిలోని పంచాయతీల్లో దోమల నివారణకు 2022లో అప్పటి ప్రభుత్వం ఫాగింగ్ మిషన్లు అందించింది. ఏడు మండలాల్లోని 183 పంచాయతీల్లో 659 గ్రామాలున్నాయి. వీటిలో 2.72 లక్షలు మందికి పైగా జనాభా ఉన్నారు. ఇటీవల జ్వరాలు విజృంభిస్తున్నా, ఫాగింగ్ మిషన్లు ఉపయోగించడం లేదు. మండల కేంద్రాల్లో మాత్రం అప్పుడప్పుడు ఫాగింగ్ చేస్తున్నారు. మైనర్ పంచాయతీలో ఫాగింగ్ మిషన్లు అటకెక్కించారు. ఇటీవల కురిసిన వర్షాలకు విషజ్వరాలు, డెంగీ, మలేరియా విజంభిస్తున్నా, దోమల నివారణకు చర్యలు మాత్రం శూన్యం అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలున్నా బయటకు తీయడంలేదు. ఒక ఫాగింగ్ మిషన్ మూడు గంటల పాటు వినియోగించాలంటే సుమారు రూ. వెయ్యి నుంచి రూ.3 వేల వరకు ఖర్చవుతుంది. దీంతో పలు కారణాలు చూపి చాలా గ్రామాల్లో వాటిని పక్కన పెట్టేశారు. కొన్ని చోట్ల మాత్రం అప్పుడప్పుడు వినియోగిస్తున్నారు. పరిస్థితి ఇలా ఉన్నా.. విస్తరణాధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాతావరణ మార్పులకు తోడు దోమలు వృద్ధి చెందడంతో పలు రకాల జ్వరాలతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. అధికారులు స్పందించి ఫాగింగ్ యంత్రాలు వినియోగించి, దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సత్యవేడుమేజర్ పంచాయతీలో ఉన్న ఫాగింగ్ మిషన్

**పంచాయతీలకు నిధులొచ్చినా..**

పంచాయతీల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు పెద్ద పంచాయతీలకు రూ.5 లక్షలు, చిన్న పంచాయతీలకు రూ.2లక్షలు మంజూరు అయ్యాయి. వీటిని పంచాయతీల్లో పారిశుద్ధ్యంతో పాటు తాగునీరు, ఇతర వసతులకు ఖర్చులు చేయాల్సి ఉంది. ఈ నిధులతో కాలనుగుణంగా నెలకు మూడు సార్లు ఫాగింగ్ చేయాలి. అయినా అధికారులు, పాలకులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

**పంచాయతీల వివరాలివీ..**

| నియోజకవర్గం | పంచాయతీలు | హ్యాబిటేషన్ గ్రామాలు |
|---|---|---|
| సత్యవేడు | 28 | 67 |
| వరదయ్యపాళెం | 29 | 119 |
| నాగలాపురం | 19 | 46 |
| కేవీబీపురం | 39 | 123 |
| పిచ్చాటూరు | 21 | 116 |
| నారాయణవనం | 19 | 75 |
| బుచ్చినాయుడుకండ్రిగ | 28 | 113 |

**కంటితుడుపు చర్యలు**

దోమల నివారణ కార్యక్రమాలు కంటితుడుపు చర్యలుగా మిగులుతున్నాయి. దోమలు ఉత్పత్తి అయ్యే ప్రదేశాలు గుర్తించి, నిరంతం ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్ చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు తూతూ మంత్రంగా సాగుతోంది. దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ అధికారులు, పీహెచ్‌సీ డాక్టర్లు చెబుతున్నారు.

**చర్యలు తీసుకొంటున్నాం**



"మేజర్ పంచాయతీ అయిన సత్యవేడులో దోమల నివారణకు ఫాగింగ్ మిషన్ ఉంది. దోమల నివారణకు ఫాగింగ్ మిషన్‌ను వినియోగిస్తున్నాం. పంచాయతీలో వనరులు తక్కువ, ఖర్చు ఎక్కువగా ఉండడంతో పరిమితంగా వినియోగిస్తున్నాం.

– పి.మంజుల, సర్పంచ్, సత్యవేడు

**వినియోగంలోకి తెచ్చేలా ఆదేశాలిచ్చాం**



ఫాగింగ్ యంత్రాలు వినియోగంలోకి తీసుకు వచ్చేలా అన్ని పంచాయతీలకు ఆదేశాలిచ్చాం. స్పందించని వారికి నోటీసు లిస్తాం. ప్రతి పంచాయతీలో వినియోగం కోసం ప్రత్యేక సమయం కేటాయించి ప్రణాళిక విడుదల చేయాలని ఆదేశించాం. పండుగలు వస్తుడడంతో ప్రత్యేక పారిశుధ్య పనులకూ ఆదేశాలిచ్చాం. దోమల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకొంటున్నాం.

– తరుణాక్షరెడ్డి, ఈఓపీఆర్డీ, సత్యవేడు

**శిక్షణ ఇచ్చారు**



సచివాలయాలకు రూ. 50 వేల నుంచి రూ.60 వేలు విలువ చేసే ఫాగింగ్ మిషన్ అందించారు. దాని నిర్వహణపై మండల పరిషత్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు సచివాలయ సిబ్బంది శిక్షణ ఇచ్చారు. నెలలో మూడు సార్లకు పైగానే దోమల నివారణకు చర్యలు తీసుకొంటున్నాం.

– మునిరవికుమార్, కార్యదర్శి, సత్యవేడు

### అర్ధరాత్రి రాహుకేతు దీపాలకు చెక్



దారాలను స్వాధీనం చేసుకుంటున్న అధికారి

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరలయం సమీపంలో అర్ధరాత్రి దాటిన తరువాత వెలుగుతున్న రాహుకేతు దీపాలకు ఆలయాధికారులు చెక్ పెట్టారు. వీటిపై పత్రికల్లో కథనాలు రావడంతో ఈఓ బాపిరెడ్డి స్పందించారు. ఆరుబయట నిద్రపోయే భక్తులను లేపి రాహుకేతు పూజలు పేరుతో దీపాలు పెట్టించే వ్యాపారులపై నిఘా పెట్టారు. హోంగార్డులు, సెక్యూరిటీ సిబ్బందిని బందోబస్తు ఏర్పాటు చేయించారు. వ్యాపారులు కల్తీనెయ్యి దీపాలు, పసుపు ధారాలు అమ్మకుండా కట్టడి చేశారు. వీరిని వెనుక నుంచి నడిపిస్తున్న మాజీ కౌన్సిలర్ రంగంలోకి వచ్చారు. దీంతో ఆలయాధికారులు ఆయన్ని హెచ్చరించారు. అర్ధరాత్రి తరువాత భక్తులతో దీపాలు వెలిగించడానికి తనకు కొంత మంది నాయకులు మద్దతు ఇస్తున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్లు చెప్పగా ఆలయాధికారులు దాన్ని ఖండించారు. మరోసారి దీపాలు పెట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులను కూడా హెచ్చరించారు. ఆలయం తెరచిన తరువాత మాత్రమే పూజా సామగ్రి విక్రయించాలని లేకుంటే దుకాణాలు మూసివేస్తామని హెచ్చరించారు.

### రోడ్డు ప్రమాదంలో కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

**శ్రీకాళహస్తి:** రోడ్డు ప్రమాదంలో పురపాలక సంఘ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందాడు. శ్రీకాళహస్తి పట్టణం ఎంఎం వాడకు చెందిన చెంచునాథ్(38) పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ ప్రాంతంలో నీరు విడుదల చేసే విభాగంలో పనిచేస్తున్నాడు. సోమవారం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా రాజీవ్‌నగర్ వద్ద ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో చెంచునాథ్ తీవ్రంగా గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

### 'పీఎం సూర్యఘర్' సద్వినియోగం చేసుకోండి

**శ్రీకాళహస్తి:** ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్యఘర్ పేరుతో అమలు చేస్తున్న ఉచిత సోలార్ ప్యానల్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సబ్సిడీతో ఉచితంగా అందజేస్తున్నారు. అదనపు విద్యుత్‌ను ట్రాన్స్‌కోకు ఇస్తే నగదును వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు.

# వ్యవసాయం ప్రైవేటీకరణకు కుట్ర



ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయికులు

**శ్రీకాళహస్తి:** ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశాన్ని కార్పొరేటర్లకు దోచి పెడుతున్న మోదీ ప్రభుత్వం చివరకు వ్యవసాయాన్ని కూడా ప్రైవేటు పరం చేసుందుకు కుట్ర పన్నుతోందని ఏపీ రైతు సంఘం నాయకులు ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరికి నిరసనగా సంయుక్త కిసార్ మోర్చా పిలుపు మేరకు ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం ఏపీ రైతు సంఘం నాయకులు ధర్నా చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ 2021లో పార్లమెంట్ సాక్షిగా ప్రధాన మోదీ నల్ల చట్టాలను ఉపసంహరించుకుంటూ రైతులకు క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. అయితే దొడ్డిదారిన కార్పొరేట్ కంపెనీలకు మేలు జరిగేలా వ్యవసాయాన్ని ప్రైవేటీకరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం దిశా నిర్దేశం చేస్తూ సర్క్యులర్ జారీ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ రైతు సంఘం నాయకలు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ 27 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని, ఆయన ఆరోగ్యం విషమించినా మోదీ సర్కార్‌లో చలనం లేదని మండిపడ్డారు.

ఇప్పటికైనా మోదీ రైతుల పక్షాన నిలబడి రైతు సంఘాల నాయకులతో చర్చలు జరిపి జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలన్నారు. అనంతరం ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, శంకరయ్య, గంధం మణి, మునిశంకర్, నాగరాజు, రాపూరు సుబ్రహ్మణ్యం, వేణు, అన్వర్‌బాషా, వెంకటేష్, వెలివేంద్రం, సుధాకర్, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దారి వసతి కల్పించండి



సత్యవేడు: రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న డీటీ వెంకటేశ్వర్లు

**సత్యవేడు:** గ్రామంలోని శ్మశానానికి దారి వసతి లేక అవస్థలు పడుతున్నామని, రెవెన్యూ అధికారులు దారి వసతి కల్పించాలని సర్పంచ్ బాలాజీ కోరారు. సోమవారం సర్పంచ్ బాలాజీ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామంలోని సర్వే నంబర్ 4లో 56 సెంట్లు భూమి శ్మశాన వాటికగా వినియోగిస్తున్నారు. దారిలో ప్రైవేటు వ్యక్తుల భూములుండడంతో దారి సమస్య ఉందని, రోడ్డు వసతి కల్పించాలని గ్రామస్తులు కోరారు. పక్కాగృహాలపై ఉన్న విద్యుత్ లైన్లు తొలగించాలని లక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ సురేష్, వీఆర్వో విక్రాంత్, సర్వేయర్ మధు, డిజిటల్ అసిస్టెంట్ గోవర్ధన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ధనలక్ష్మి, ఏఎన్ఎం రోసిలిన్, వ్యవసాయ అసిస్టెంట్ స్వర్ణ, వెటర్నటీ అసిస్టెంట్ షాఈదుల్లా తదితరులు పాల్గొన్నారు.

### వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

**శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట):** సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి మురళి కోరారు. రేణిగుంటలో సోమవారం సీపీఐ శత వార్షికోత్సవ కరపత్రాలను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి, 99 సంవత్సరాలు పూర్తి అయ్యిందని, 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అన్ని చోట్ల పార్టీ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గం కార్యదర్శి జనామాల గురవయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వైఎస్ మణి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కార్తీక్, మురళి, సెల్వంపాల్గొన్నారు.

# విద్యుత్ వడ్డనకు నిరసనగా 27న 'పోరుబాట'



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

**వరదయ్యపాళెం:** సామాన్యుల నడ్డి విరిచేలా కరెంటు చార్జీల మోత మోగించిన కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈ నెల 27వ తేదీన నాగలాపురంలో వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. సోమవారం తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తితో కలిసి నియోజకవర్గ పార్టీ శ్రేణుల సమక్షంలో పోరుబాట వాల్‌పోస్టర్లను నూకతోటి రాజేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు నాగలాపురంలోని ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయి నిరసన కార్యక్రమం నిర్వహించి ఏడీఈకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 7 మండలాల నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చి పోరుబాట కార్యక్రమానికి మద్దతు పలికి, విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎంపీ మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ అధికారం చేపట్టిన 6 నెలలకే విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచి, సామాన్య ప్రజలపై భారం మోపిన కూటమి ప్రభుత్వం చెంప చెల్లుమనేలా సత్యవేడు నియోజకవర్గంలో పోరుబాట కార్యక్రమం విజయవంతం కావాలని కోరారు. నియోజకవర్గంలోని 7 మండలాల పార్టీ శ్రేణుల అధిక సంఖ్యలో తరలివచ్చి, పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. 6 నెలలకే కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంటుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు ఎగనామం పెట్టి ఎంతసేవటికీ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేందుకు రోజుకో కుట్రను తెర మీదకు తెస్తూ పచ్చ పత్రికల ద్వారా పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ పరిణామాలన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్మిక విభాగం మాజీ కన్వీనర్ బీరేంద్ర వర్మ, పార్టీ నాయకులు దామోదర్ రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, శ్రీధర్, మునిరెడ్డి పాల్గొన్నారు.

# క్రిస్మస్ శోభ



విద్యుత్ దీపాల వెలుగులో నాగలాపురం సీఎస్ఐ చర్చి

**నాగలాపురం:** గ్రామంలోని సన్నిధివీధిలో ఉన్న సీఎస్ఐ చర్చిని క్రిస్మస్ పండుగ సందర్భంగా విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. నాలుగు రోజుల క్రితమే చర్చికి రంగులు వేయించారు. చర్చి లోపల రంగు కాగితాలు, బెలూన్లు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చర్చి పరిసర ప్రాంతాల్లో క్రిస్మస్ ట్రీ ఏర్పాటు చేశారు.

**శ్రీకాళహస్తిలో క్రిస్మస్ ర్యాలీ**

**శ్రీకాళహస్తి:** పట్టణంలో సోమవారం శ్రీకాళహస్తి పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు జన్మదినం గురించి వివరించారు. శాంతి సందేశం వినిపించారు. ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో అంబ్రోస్, సుందర్‌రాజు, జీవమని, రవిద్యాని, ఎలీషా, రఫాయేల్, జోసెఫ్, మణిబాబు, మోజస్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు



వివిధ వేషధారణలో చిన్నారులు

**ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు**

**శ్రీకాళహస్తి:** స్థానిక ఎల్ఐసీ కాలనీలోని ఓ పాఠశాలలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోమన్ క్యాథలిక్ చర్చి పాదర్ రెవరెండ్ ప్రీతం, తొట్టంబేడు ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఆనంద్‌బాబు హాజరయ్యారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కీస్తు పుట్టుక నాటకాన్ని ప్రదర్శించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ షెర్లీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులో వినతుల వెల్లువ



బుచ్చినాయుడుకండ్రిగ: వినతులను స్వీకరిస్తున్న తహసీల్దార్ సుబ్రమణ్యం



రేణిగుంట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిందేపల్లె వాసులు

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని కనమనంబేడు, తంగెళ్లపురం గ్రామాల్లో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో వినతులు వెల్లువెత్తాయి. రైతులు పలువురు భూసమస్యలపై తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తెలిపారు. అడంగళ్ వన్‌బీ, రిజిస్టర్ 22 (ఏ), భూ కొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీ సర్వే రికార్డుల్లో నమోదైన తప్పులు, అసైన్డ్, చుక్కల భూముల పరాధీనం, కబ్జాలు తదితర సమస్యలు రెవెన్యూ సదస్సులో అర్జీలిస్తే అధికారులు పరిశీలించి పరిష్కారిస్తామని తెలిపారు. శ్మశానికి వెళ్లటానికి దారి లేక పోవడంతో శవాన్ని పంట పాలాలలో తీసుకుపోవటానికి నానా అవస్థలు పడుతున్నామని, శ్మశానికి దారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు, ఎంపీ డీఓ త్రివిక్రమ్‌రావు, ఎంఈఓ రవీంద్రనాథ్, మధునా యుడు, వీఆర్ఓ బాలమురళీకృష్ణ, సర్పంచ్ జనార్ధన్ పాల్గొన్నారు.

**మా రోడ్డు మాకు ఇప్పించండి**

**అధికారులను కోరిన చిందేపల్లి గ్రామస్తులు**

**రేణిగుంట(ఏర్పేడు):** ఈసీఎల్ కంపెనీ దౌర్జన్యాలను అరికట్టి, తమ రోడ్డును తమకు ఇప్పించాలని చిందేపల్లి గ్రామస్తులు సోమవారం అధికారులను కోరారు. ఏర్పేడు మండలంలోని చిందేపల్లి పంచాయతీలో సోమవారం రెవెన్యూసదస్సు నిర్వహించారు. సదస్సు లో పాల్గొన్న తహసీల్దార్ భార్గవికి చిందేపల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేసి, తమ రోడ్డు తమకు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. పూర్వీకుల నుంచి తమ గ్రామానికి శ్రీకాళహస్తి –నాయుడుపేట జాతీయ రహ దారి నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు ఉందన్నారు. అయితే ఈసీఎల్ కంపెనీ కుట్రపూరితంగా తమ రోడ్డును కబ్జా చేసిందని తెలిపారు. స్పందించిన తహసీల్దార్ భార్గవి చిందేపల్లి రోడ్డు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.